క్లుప్తంగా

జీపీఎస్ స్టేషన్ పరిశీలన



పరిశీలిస్తున్న రమేష్

కలువాయి(సైదాపురం): ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన నేషనల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారి రమేష్ మంగళవారం మండలంలోని కుల్లూరులో ఉన్న జీపీఎస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే కాని గ్రామ సర్వేలు చేయాలంటే జీపీఎస్ స్టేషన్ ఫిల్లర్ కీలకమన్నారు. ప్రతి 30 నుంచి 60 కిలోమీటర్ పరిధిలో జీపీఎస్ ఫిల్లర్ 10 సంవత్సరాల క్రితమే రెండు రాష్ట్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ పిల్లర్లు ఉన్నాయా లేదా అనేందుకు పరిశీలన చేసేందుకు వచ్చామని ఆయన తెలియజేశారు.

ఫిజియోథెరపీతో కండరాల్లో కదలిక



ఫిజియోథెరపీ కిట్లు పంపిణీ

వాకాడు: ఫిజియోథెరపీ చేయడంతో కండరాలలో చలనం వస్తుందని, తద్వారా కండరాలకు బలం చేకూరుతుందని ఫిజియోథెరపీ డాక్టర్ రమేష్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో వివిధ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఫిజియోథెరపీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఫిజియోథెరపీ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ సందీప్‌కుమార్, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణల గుర్తింపునకు ప్రత్యేక బృందాలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి రూరల్ మండలంలోని బసవాయిగుంట, పూలరంగడుపల్లి, మన్నేగుంట తదితర ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన భూమికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేసి ఆక్రమణలు గుర్తించనున్నట్లు తహశీల్దార్ రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ బసవాయిగుంట పరిసర ప్రాంతాల్లో భూ ఆక్రమణలపై ఇటీవల గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా పర్యటించారని తెలిపారు. ఆక్రమణలు గుర్తించమని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇందుకు సంబంధించి త్వరలో భూ ఆక్రమణలు గుర్తించి నివేదిక సమర్పించనున్నట్లు వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణం శిలాఫలకం ఆవిష్కరణ

దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాళెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. కుప్పారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలో రూ.7 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.10.10 లక్షలతో నిర్మించిన నాలుగు గోశాల షెడ్లును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రతి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు భారీగా వేశామని తెలిపారు. శ్రీనివాసులునాయుడు, గోపాల్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, జకరయ్య, మనోహర్‌రెడ్డి, బాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి అభివృద్ధికి విరాళం

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కోసం నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని ఆగర్వాల్ పరిశ్రమవారు సీఎస్‌ఆర్ ఫండ్ కింద రూ.1.50 లక్షలు నగదు చెక్కును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి మంగళవారం అందించారు. నిధులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వారికి అప్పగించి ఆసుపత్రిలో కావాల్సిన సౌకర్యాల కోసం ఉపయోగించాలని ఆదేశించారు. ఇలా కంపెనీలు వారు ఇచ్చే నిధులతోనే ఆసుపత్రిని ప్రైవేట్ ఆసుపత్రి స్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు.

కండలేరులో 49.505 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 49.505 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, లోలెవల్ కాలువకు 30, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఏప్రిల్ 12వ తేదీన ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో యాగ్నియాన్ 2025 జాతీయస్థాయి సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సదస్సుకు పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరై తమ ఆవిష్కరణలను ప్రజెంట్ చేస్తారన్నారు. హెచ్‌ఓడీ హరినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురోగతి తిరోగమనం



వరదల దాటికి కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు



కాళంగి నదిలో బేస్ స్థాయిలో పిల్లర్లు

గత ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం పలు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి విజయపథంలో ముందుకు సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజా ప్రయోజనాలు, పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి ఉన్నాయి. పలు గ్రామాల ప్రజల రాకపోకలు, రైతుల రవాణా సదుపాయం తదితర సౌకర్యాల కోసం గత ప్రభుత్వం వెదురుపట్టు ఎస్టీ కాలనీ సమీపంలో కాళంగి నదిపై చేపట్టిన వంతెన నిర్మాణం పనులు ఆగిపోయి కొన్ని నెలలు గడిచిపోతున్న ఈ పనులు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చేతులెత్తేస్తున్నారు.

– దొరవారిసత్రం

- ఆగిన వంతెన నిర్మాణ పనులు
- కాళంగి నదిపై కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

వెదురుపట్టు ఎస్టీ కాలనీ సమీపంలోని కాళంగి నదిపై పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.12.30 కోట్లు నిధులతో గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నదిలో డైవర్షన్ రోడ్డు నిర్మించి, వంతెనకు చెందిన పిల్లర్ల పనులు చేపట్టారు. గత ఏడాది డిసెంబర్‌లో భారీ వర్షాలు కురిసి వరదలు రావడంతో నదిలో వేసిన డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం వంతెన నిర్మాణం ప్రాంతంలో చుక్క నీళ్లు లేకుండా ఎండిపోయి ఉంది. అయినా పనులు ముందుకు సాగకపోవడంతో వంతెన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలవుతాయోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

వంతెన నిర్మాణం పూర్తయితే దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో పలు గ్రామాల ప్రజలు సులువుగా జాతీయ రహదారిని చేరుకుంటారు. దీంతో పాటు డీవీ సత్రం మండల కేంద్రం చుట్టూ తిరిగి రాకుండా తుంగమడుగు, దుప్పలవారికండ్రిగ తదితర గ్రామాల ప్రజలు సులువుగా చేరుకుంటారు. అదే విధంగా రైతులకు రవాణా సదుపాయం ఏర్పడుతుంది. బ్రిడ్జి నిర్మాణంతో ఇటు రైతులు, ప్రజలకు పలు ప్రయోజనాలు ఉంటాయి.



కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణం ప్లానింగ్

ఏళ్ల నాటి కల నెరవేరుతుంది



వెదురుపట్టు ఎస్టీ కాలనీకి సమీపంలోని కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణం ఏళ్ల నాటి కల. ఈ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తే మండల కేంద్రానికి సులువుగా వెళ్లడమే కాకుండా రవాణా సదుపాయం ఏర్పడుతుంది. ప్రజలకు ఎంతో సౌకర్యం ఏర్పడుతుంది.

– ఎం.ప్రతాప్, తుంగమడుగు గ్రామం

రైతులకు పలు ప్రయోజనాలు



కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణంతో రైతులకు పలు ప్రయోజనాలు ఉంటాయి. ముఖ్యంగా పండించిన పంటలను తరలించేందుకు రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఇవే కాకుండా సూళ్లూరుపేట, నాయుడుపేట తదితర పట్టణ ప్రాంతాలకు సులువుగా వెళ్లవచ్చు.

– కె.పోలయ్య, తుంగమడుగు గ్రామం

వారం రోజుల్లో మొదలవుతాయి

వెదురుపట్టు ఎస్సీ కాలనీ వద్ద కాళంగి నదిపై బ్రిడ్జి నిర్మాణం పనులు వారం రోజుల్లో మొదలవుతాయి. గత ఏడాది వరదలు రావడంతో జరుగుతున్న పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం నదిలో నీళ్లు ఎండిపోయి ఉన్నాయి. కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టే విధంగా చర్యలు చేపడుతాం.

– బి.రమణయ్య, డీఈ, పంచాయతీ రాజ్ శాఖ

నోటీస్‌బోర్డ్

నేడు సైదాపురంలో ప్రజాదర్బార్

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

28న మున్సిపల్ సమావేశం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, మున్సిపాలిటీ అభివృద్ధి ప్రణాళికలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కేజీబీవీకి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల)లో 2025–26 విద్యా సంవత్సరం పురస్కరించుకుని 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(బైపీసీ)లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ నెల 22వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉన్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 96186 56138 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వైభవంగా వార్షికోత్సవ వేడుకలు





విశేష అలంకరణలో శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారు, స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో కొలువైయున్న శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అంగరంగ వైభవంగా ఆరో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆలయంలో హోమాలు, కుంబాభిషేక పూజలు వేద మంత్రోచ్చారణతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తాడిమేడు గ్రామానికి చెందిన ఈదూరు సుందరయ్య కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. అనగొల్లపాళెంకు చెందిన కట్టబోయిన జయచంద్ర కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైద్యురాలిని మోసం చేసి రూ.60 లక్షలు స్వాహా

నాయుడుపేట టౌన్: నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలికి అధునిక వైద్య పరికరాలను ఇస్తామని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.60 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట పట్టణంలోని ఆంధ్రాబ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న వి.సత్యనారాయణ నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు బిందు మీనన్‌కు ఇతర ప్రాంతాల నుంచి అత్యాధునిక వైద్య పరికరాలను తీసుకొచ్చి ఇస్తామని నమ్మబలికాడు. తక్కువ ధరకే లక్షలు విలువ చేసే పరికరాలను ఇస్తామని చెప్పడంతో ఈ నెల 21వ తేదీ సత్యనారాయణకు వైద్యురాలు రూ.60 లక్షలు నగదు ఇచ్చింది. అయితే పరికరాలు పంపక పోవడంతో ఈవిషయమై సత్యనారాయణను నిలదీసింది. అయితే సత్యనారాయణ ఆమెను బెదరించడంతో ఖంగుతింది. నగదు విషయమై అడిగేందుకు వైద్యురాలు రెండు రోజుల కిందట నాయుడుపేటకు వచ్చి తన వద్ద తీసుకున్న నగదు ఇచ్చేయాలని కోరింది. నగదు ఇవ్వకపోగా సత్యనారాయణ ఆమెపై దౌర్జన్యం చేయడంతో మంగళవారం వైద్యురాలు నాయుడుపేట సీఐ బాబిని కలిసి మోసం చేసిన వైనంపై ఫిర్యాదు చేసింది. మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని మంగళవారం రాత్రి గూడూరు కోర్టు న్యాయమూర్తి వద్ద హాజరు పెట్టి రియాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

జాతరలో ఆటల పోటీలు



హోరాహోరీగా వాలీబాల్ ఆడుతున్న యువత

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ జాతర సందర్భంగా రెండు రోజులపాటు జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి 32 వాలీబాల్ టీమ్‌లు, 20 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. విజేతలకు షీల్డ్‌తో పాటు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.7 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు ఇస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

రైతులకు అవగాహన



సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఫర్మెంటెడ్ సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో కోట మండలం గోవిందపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాసులు (34)కు జీవిత ఖైదు, రూ.23,000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఓ దంపతులు కోట మండలంలోని గోవిందపల్లి గ్రామంలో ఉంటూ పనులకు వెళ్తున్నారు. వారి కుమార్తె స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆరో తరగతి చదువుతుండేది. 2023 ఏప్రిల్ 18వ తేదీన ఉదయం బడికి వెళ్లకుండా ఇంటికి సమీపంలో సరదాగా చేపలు పట్టడానికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు బాలికను తీసుకెళ్లి బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో అతను పారిపోయాడు. ఆమె ఇంటికెళ్లి తల్లికి ఈ విషయం చెప్పింది. అదేరోజు ఫిర్యాదు అందుకున్న కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం శ్రీనివాసులుపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రత్యేక పీపీ చంద్రశేఖర్ వాదించారు.

30న పెంచలకోనలో ఉగాది వేడుకలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఈ నెల 30వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 4 గంటలకు మూలమూర్తికి అభిషేకం, 5 గంటలకు పూలంగిసేవ, 9 గంటలకు బంగారు గరుడ వాహనంపై క్షేత్రోత్సవం, 11 గంటలకు పంచాంగ శ్రవణం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గోనుపల్లి గ్రామంలోని శ్రీపెనుశిల నరసింహస్వామి ఆలయంలో ఉగాది ఉత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం, లింగవరం గ్రామాలలో మంగళవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. తిరుపతికి చెందిన స్విమ్స్ వైద్యులు డాక్టర్ పద్మావతి పలువురు మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వరగలి పీహెచ్‌సీ వైద్యులు గీతామణి, స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, సర్పంచ్‌లు నాశిన సుబ్రహ్మణ్యం, నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, శోభ, శ్రీకావ్య, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని వారికి ప్రాధాన్యం

చిల్లకూరు: గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా అర్హత లేని వారికి ప్రాధాన్యం కల్పించడం ఎంత వరకు సబబని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు అన్నారు. మంగళవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాను కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీలు కాని వారిని సభ్యులుగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించారన్నారు. అయితే ఎక్కడా స్వచ్ఛంద సంస్థలు నిర్వహించకుండా ఎస్సీలుగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. అధికారులు స్పందించి విచారణ చేయాలని కోరారు.

సర్పంచ్ ఫిర్యాదుపై డీఎల్‌పీఓ విచారణ



టీడీపీ నేతల సమక్షంలో విచారణ చేపట్టిన గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ

దక్కిలి: దక్కిలి సర్పంచ్ శనగా వేమక్క పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గూడూరు డీఎల్‌పీఓ స్థానిక సచివాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని విచారించారు. పంచాయతీ కార్యదర్శి తనకు సంబంధం లేకుండానే పాలన సాగిస్తున్నారని సర్పంచ్ విచారణ అధికారికి తెలిపారు. విచారణలో భాగంగా పంచాయతీ రికార్డులను పరిశీలించారు. విచారణ అనంతరం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి తన హక్కులకు భంగం కలిగిస్తున్నారని సర్పంచ్ ఫిర్యాదు చేశారన్నారు. విచారణ సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అయితే ఈ విచారణకు మండలానికి చెందిన టీడీపీ నేతలు హాజరు కావడం సబబు కాదని సర్పంచ్ ఆరోపించారు. విచారణలో తనను డీఎల్‌పీఓ గట్టిగా పలు అంశాలపై నిలదీశారని సర్పంచ్ ఆరోపించారు.

పకడ్బందీగా ప్లాస్టిక్ నివారణ



ప్లాస్టిక్ నివారించాలని ప్రచారం

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లు, వాటికి సంబంధించినవి పూర్తిస్థాయిలో నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు పట్టణంలో ఆటోలతోపాటు మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాల్లో ప్రచారం చేస్తు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని, విక్రయాలు జరుపరాదని ప్రజలకు అవగాహన కలిస్తున్నారు. మంగళవారం పలు సచివాలయాలకు సంబంధించి కార్యదర్శులు మున్సిపల్ మేస్త్రీలతో కలిసి పట్టణంలో పలు దుకాణాలకు వెళ్లి అవగాహన కల్పించి ప్లాస్టిక్ విక్రయాలను పూర్తిస్థాయిలో నిలిపివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని కమిషనర్ హెచ్చరికలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయశేఖర్, సచివాలయ కార్యదర్శులు పద్మావతి, సంగీతా, మున్సిపల్ మేస్త్రీలు వంకపూరి శీనయ్య, కటకం సురేష్, రవీంద్ర తదితరులు ఉన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న మేనేజర్ పవన్‌కుమార్

కలువాయి(సైదాపురం): మండలంలోని తోపుగుంట రైతు సేవా కేంద్రంలో మంగళవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో కలువాయి మండలంలో సుమారు 1300 ఎకరాల్లో పప్పు శనగల పంటను రైతులు సాగు చేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించి మద్దతు ధర రూ.5650 క్వింటాల్ వంతున ఈ కొనుగోలు కేంద్రంలో సేకరిస్తామన్నారు. రైతు పంట నమోదు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాను రైతు సేవా కేంద్రానికి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రతాప్, శ్రీనివాసులు తదితరులున్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ

చిల్లకూరు: పీపుల్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఓడూరు పంచాయతీ పరిధిలోని రెండు గిరిజన కాలనీవాసులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సీడీపీఓ ఎస్‌కే మహబూబి, సూపర్‌వైజర్ రేణుక, ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి



రైతు వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

వెంకటగిరి రూరల్: మండల పరిధిలో ఉన్న రైతులు తప్పనిసరిగా ఏపీ ఎఫ్ఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయించుకోవాలని ఏఓ సుజాత పేర్కొన్నారు. మండలంలోని పెట్లూరు ఆర్బీకేలో మంగళవారం విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 6328 మంది రైతులకు 3183 మంది రైతులకు ఏపీఎఫ్ఆర్ పోర్టల్ యాప్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీపీఏలు రాజ్యలక్ష్మి, రేఖ రైతులు పాల్గొన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

సైదాపురం: మండలంలోని కట్టుబడిపల్లి గ్రామంలో కోడి పందాలను నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్ఐ క్రాంతికుమార్ తమ సిబ్బందితో కలసి మంగళవారం మెరుపుదాడులు నిర్వహించారు. నలుగురు కోడి పందెం రాయుళ్లతోపాటు, ఒక కోడి పుంజు, మూడు మోటారుసైకిళ్లు, రూ.10,450 నగదు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది రైటర్ సురేష్, కమలాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.